

మోపాల్‌లో దసరా ఉత్సవాలకు ముస్తాబైన మహాలక్ష్మి ఆలయం

శమీపూజలకు ఏర్పాట్లు

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

చెడుపై మంచి విజయం సాధించిన సందర్భంగా విజయదశమి వేడుకలను జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. శ్రీరాముడు రావణాసురుడిని వధించి అయోధ్యకు తిరిగిన వచ్చిన రోజు.. జగన్మాత దుర్గాదేవి రాక్షసుడిని వధించిన రోజు.. పాండవులు అజ్ఞాతవాసం నుంచి తిరిగి వచ్చి జమ్మి చెట్టుపైనుంచి ఆయుధాలు తీసుకున్న రోజుగా.. చెప్పుకొంటూ దసరా వేడుకలను జరుపుతారని చెబుతారు. ఇందుకు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తిచేశారు. శమీపూజలు.. పాలపిట్ట దర్శనాలు.. కొత్త దుస్తులు ధరించి బంగారంగా జమ్మి ఆకును పెద్దలకు ఇచ్చి ఆశీస్సులు తీసుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకోనున్నారు. కొత్తవాహనాలు కొనుగోలు చేసి ఆలయాల్లో పూజలు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. కామారెడ్డిలో లేజర్‌షో ప్రత్యేక ఆకర్షణగా ఉండనుంది. ఉమ్మడి జిల్లాల్లో ఆర్మూర్, మోర్తాడ్, భీమ్‌గల్, బోధన్, తదితర ప్రాంతాల్లో రావణ దహనం, మహిషాసుర మర్దిని కార్యక్రమాలు చేపట్టనున్నారు.

రసాభాసగా కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఆర్మూర్ పట్టణం, న్యూస్‌టుడే: పేదల డబ్బుతోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆర్మూర్, ఆలూరు మండలాల్లోని కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ అన్వేష్‌రెడ్డి, పుర ఛైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్యతో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..



ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న పుర కౌన్సిలర్లు, నాయకులు

ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తనకు సన్నిహితులని, ఆర్మూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి మాజీ సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన గొప్ప పథకం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అన్నారు. ఆ పథకాలను కాంగ్రెస్ సర్కారు కొనసాగించడం అభినందనీయమన్నారు. ఎవరు అధికారంలోకి వచ్చినా హామీల అమలుకు సమయం పడుతుందన్నారు. అనంతరం కాటమయ్య రక్షణ కిట్లను కల్లుగీత కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ స్టీవెన్ సన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షేక్‌మున్నా, నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, కౌన్సిలర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

తులం బంగారం ఏదీ..?

కల్యాణలక్ష్మి పథకంలో భాగంగా నగదుతో పాటు తులం బంగారం ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని మహిళలు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేవని, హామీల అమలుకు కొంత సమయం ఇద్దామన్నారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందలేదని, కొందరికిచ్చినవి బౌన్స్ అయ్యాయని మైనార్టీ కౌన్సిలర్లు, నాయకులు ప్రశ్నించారు. దానికి అధికారులే కారణమని, సమస్య తన దృష్టికి తెస్తే పరిష్కారం చూపేవాడినని ఎమ్మెల్యే చెప్పారు. ఈ సమయంలో భాజపా, కాంగ్రెస్ నాయకులు వేదిక పైకి చేరుకోవడంతో కొంత వాగ్వాదం నెలకొంది.

ప్రొటోకాల్ వివాదం

ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ అర్వింద్, పుర ఛైర్‌పర్సన్ లావణ్య చిత్రాలు లేవని ఓ కౌన్సిలర్ భర్త ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం జరుగుతుండగానే పుర ఛైర్‌పర్సన్ చిత్రం ఉన్న ఫ్లెక్సీని అధికారులు ఏర్పాటుచేశారు. కేవలం లబ్ధిదారులనే కార్యక్రమానికి అనుమతి ఇవ్వడంతో భాజపా నాయకులు పోలీసుల మధ్య వాగ్వాదం నెలకొంది. కాంగ్రెస్ నాయకులు లోపలికి వెళ్లారని ఆరోపించడంతో వారిని కూడా బయటకు పంపిస్తామని పోలీసులు తెలిపారు.

కాకతీయ కాల్వకు నీటి విడుదల నిలిపివేత

శ్రీరామసాగర్, న్యూస్‌టుడే: శ్రీరామసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాల్వ ద్వారా నీటి విడుదలను శుక్రవారం నిలిపివేసినట్లు ప్రాజెక్టు ఏఈఈ కొత్త రవి తెలిపారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి సమీపంలోని నాగులపేట్, వెల్లుల్ల గ్రామాల మధ్యన కాల్వలో ఇద్దరు గల్లంతు కావడంతో నీటి విడుదల నిలిపేశామన్నారు. ఎగువ నుంచి 11590 క్యూసెక్కుల వరద చేరుతోందన్నారు. ప్రాజెక్టులో 1091 అడుగుల పూర్తిస్థాయి నీటిమట్టం ఉంది. ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాల్వకు 150, సరస్వతికి 500, వరద కాల్వకు 2000, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నామన్నారు.

సొంత జిల్లాకు తహసీల్దార్లు..

న్యూస్‌టుడే, నిజామాబాద్ కలెక్టరేట్

శాసనసభ, లోక్‌సభ ఎన్నికల కోడ్‌లో భాగంగా జిల్లా నుంచి 33 మంది తహసీల్దార్లు, తొమ్మిది మంది నాయబ్ తహసీల్దార్లు జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి జిల్లాలకు బదిలీపై వెళ్లారు. ఎన్నికలు ముగియగానే సొంత జిల్లాకు వెళ్తామని అనుకున్నప్పటికీ.. తీవ్ర జాప్యంతో చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది. దీనిపై రెవెన్యూ సంఘం నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని పలుమార్లు కలిసి విన్నవించగా సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో సొంత జిల్లాలకు ఎవరు వెళ్తారో వారు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో ఇతర జిల్లాలకు వెళ్లిన వారికి ఊరట లభించనుంది. వచ్చే నాలుగు రోజుల్లో ఈ ప్రక్రియ ముగియనుంది. బదిలీలకు అవకాశం ఇచ్చినందుకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

452 మంది రిపోర్టింగ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2024లో ఎంపికై నియామక పత్రాలు పొందిన 465 మంది జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం 452 మంది రిపోర్టు చేశారు. వీరి రాకతో డీఈవో కార్యాలయం సందడిగా మారింది. నూతన అభ్యర్థులకు వివిధ ఉపాధ్యాయుల సంఘాల ప్రతినిధులు మార్గదర్శనం చేశారు.



కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలో చేరిన వారితో ఉపాధ్యాయ సంఘం నాయకులు



సహస్ర శివ లింగార్చన

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిజామాబాద్ జిల్లాకేంద్రం గాయత్రినగర్‌లోని గాయిత్రి ఆలయంలో సహస్ర లింగార్చన నిర్వహించారు. 1128 మరకత శివ లింగాలకు పూజారులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

– ఈనాడు, నిజామాబాద్

ఆదాయ లెక్కల్లో గోల్‌మాల్

● పొతంగల్ సహకార సంఘ పాలకవర్గం, కార్యదర్శిపై చర్యలు

పొతంగల్, న్యూస్‌టుడే : పొతంగల్ సహకార సంఘం ఆదాయం లెక్కలు చూపడంలో నిర్లక్ష్యం వహించిన పాలకవర్గం, కార్యదర్శిపై డీసీవో శ్రీనివాస్‌రావు చర్యలు చేపట్టారు. సంఘం నష్టాల బాట పట్టడంతో సహకార చట్టంలోని సెక్షన్ 51 ప్రకారం విచారణ జరపాలని సంఘ సభ్యులు మహాజన సభలో తీర్మానించి ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌ను డీసీవో విచారణ అధికారిగా నియమించారు. సమగ్ర విచారణ జరిపిన ఆ అధికారి పెద్ద మొత్తంలో అవకతవకలు జరిగినట్లు తేల్చారు. ఆదాయ, వాణిజ్య పన్ను, పీఎఫ్ చెల్లింపుల్లో కార్యదర్శి నిర్లక్ష్యం వహించడంతో సంబంధితశాఖలు విండో ఖాతాలు జప్తు చేసి సుమారు రూ.60లక్షల జరిమానా విధించారు. జప్తు చేసిన ఖాతాల ద్వారా జరిమానాను సంబంధిత శాఖలు రాబట్టుకున్నాయి. పాలకవర్గం, కార్యదర్శి నిర్లక్ష్యం కారణంగానే సంఘానికి నష్టం వాటిల్లినట్లు విచారణలో తేలింది. సంఘ కార్యదర్శి భరత్‌కుమార్ అక్రమాలకు పాల్పడుతూ విధుల నిర్వహణలో పూర్తి నిర్లక్ష్యం వహించినందుకు ఆయనను సస్పెండ్ చేస్తూ డీసీవో ఆదేశాలు జారీ చేశారు. సంఘ వ్యవహారాల నిర్వహణలో పాలకవర్గం పూర్తిగా విఫలమైనందున పాలకవర్గంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని కారణం కోరుతూ డీసీవో నోటీసులు జారీ చేశారు.

14న నిరసన ప్రదర్శన

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఇటీవల ఓ ఉపాధ్యాయుడి సమస్యను విన్నవించేందుకు జిల్లా కార్యాలయానికి వచ్చిన ఉపాధ్యాయ సంఘాలపై డీఈవో చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 14న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలయ్య, ఆర్‌యూపీపీ అధ్యక్షుడు జమీలుల్లా, సుధాం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నియామక ఉత్తర్వు అందజేత

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు నిజామాబాద్ నగరాభివృద్ధి సంస్థ(నుడా) ఛైర్మన్‌గా నియమితులు కాగా.. అందుకు సంబంధించి మున్సిపల్ ప్రిన్సిపల్ కార్యదర్శి దాన కిశోర్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలను హైదరాబాద్‌లో శుక్రవారం కేశ వేణు కలవగా.. ఆయనకు ఉత్తర్వుల పత్రం అందజేశారు. తన నియామకానికి కృషి చేసిన వారితోపాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు సహకారం అందించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఛైర్మన్ నియామకం పూర్తి కాగా.. డైరెక్టర్లను నియమించాల్సి ఉంది.



ఉత్తర్వు అందజేస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్





చెక్కు అందిస్తున్న దాత, రైతు చంద్రశేఖర్‌రావు

ఆలయ నిర్మాణానికి విరాళం

రెంజల్ : రెంజల్ మండలం సాటాపూర్‌లో రామాలయ నిర్మాణానికి దాత, రైతు చంద్రశేఖర్‌రావు రూ.1,52,232 విలువ చేసే రెండు చెక్కులను శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నితిన్‌కు అందజేశారు. ఆలయ నిర్మాణానికి చేయూత అందించిన చంద్రశేఖర్‌రావు కుటుంబానికి ఆలయ కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గంగారాం, గోవర్ధన్, సాయిలు తదితరులు ఉన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని మండలంలోని నడిపల్లితండా వద్ద 44వ జాతీయ రహదారిపై డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వాహనాన్ని తనిఖీ చేయగా 18 క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరికిందన్నారు. వాహన చోదకుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశామన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

కామారెడ్డి కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నూతన ఉపాధ్యాయులు కృషి చేయాలని టీపీటీఎఫ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో శుక్రవారం రిపోర్ట్ చేయడానికి వచ్చిన ఉపాధ్యాయులకు వారు టీపీటీఎఫ్ మాసపత్రికలు, కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఉపాధ్యాయ నియామకాల్లో ఎలాంటి జాప్యం లేకుండా ఉద్యోగాలు భర్తీ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పండుగకు వస్తుండగా ప్రమాదం

● ముగ్గురికి గాయాలు

ఇందల్‌వాయి, న్యూస్‌టుడే: కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో నివాసముంటున్న వారు స్వగ్రామం వస్తుండగా కారు అదుపుతప్పి రహదారి పక్కన బోల్తాపడి పలువురికి గాయాలైన ఘటన ఇందల్‌వాయి మండలం గంగారాం తండా పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మనోజ్‌కుమార్ కథనం ప్రకారం.. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన దొంతుల రాజేష్ వృత్తిరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. దసరా పండగకు కారులో భార్య సృజన, కుమారుడు కుషాల్, కూతురు తన్వితో కలిసి స్వగ్రామానికి బయలుదేరారు. ఇందల్‌వాయి మండల పరిధిలో 44వ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి పక్కన గుంతలో పడిపోయింది. ఈ ఘటనలో రాజేష్ భార్యతో పాటు పిల్లలు గాయపడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేరుకుపోతున్న అప్పీళ్లు- ఫిర్యాదులు

● పరిష్కారంపై దృష్టేది..?

● నేడు స.హ చట్టం అమలు దినోత్సవం

న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

అవినీతిని అంతమొందించేందుకు తెచ్చిన సమాచార హక్కు చట్టం అమలుపై యంత్రాంగం దృష్టి పెట్టడం లేదు. ఉమ్మడి జిల్లాలో స.హ చట్టం కింద దరఖాస్తు చేసిన అనేక ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. వందలాది అప్పీళ్లు-ఫిర్యాదులు అపరిష్కృతంగానే మిగిలాయి. స.హ కమిషనర్లు లేక వ్యవస్థ గాడి తప్పుతోంది. నేడు (శనివారం) జాతీయ స.హ చట్టం అమలు దినోత్సవం సందర్భంగా కథనం.



జిల్లా	అప్పీళ్లు	ఫిర్యాదులు
నిజామాబాద్	109	74
కామారెడ్డి	162	57

402 దరఖాస్తులు అపరిష్కృతం

సమాచారం తెలుసుకోవడం పౌరుల ప్రాథమిక విధి. నిర్దిష్ట గడువులోగా సమాచారం ఇవ్వకుంటే పై అధికారికి అప్పీలు చేసుకునే వీలుంది. ఉమ్మడి జిల్లా నుంచి 402 అప్పీళ్లు, ఫిర్యాదులు అపరిష్కృతంగానే ఉన్నాయి. సమాచార కమిషన్‌లో కమిషనర్లు లేక సమస్య నెలకొంది. ఏళ్ల నుంచి సమాచారం ఇచ్చేవారే కరవయ్యారు. స.హ చట్టం అమలుకు జిల్లాల్లో అధికారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం లేదు.

కమిటీల ఏర్పాటు లేక

సాధారణ పరిపాలనశాఖ 2013లో ప్రతి జిల్లాల అధికారులు, స.హ చట్టం ఉద్యమకారులతో కలిసి ప్రభుత్వ కమిటీ వేసి అమలు తీరును పర్యవేక్షించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఏ ఒక్క కమిటీ వేసిన దాఖలాలు లేవు. మూడు నెలలకోసారి జిల్లా నోడల్ అధికారి అయిన సంయుక్త పాలనాధికారితో స.హ చట్టం అమలుతీరుపై సమీక్షలు నిర్వహించాలి. రెండు జిల్లాల్లో సమీక్షలు జరిగిన సందర్భాలు లేవు. స.హ చట్టం అమలుకు పకడ్బందీ ప్రణాళిక అవసరమని పరిరక్షణ కమిటీ రాష్ట్ర ప్రతినిధి అంకం నరేశ్ వెల్లడించారు. అప్పీళ్లు, ఫిర్యాదులపై దృష్టి పెట్టాలన్నారు.

అంతర్ జిల్లా పోటీలకు ఎంపిక

నిజామాబాద్ క్రీడావిభాగం : హైదరాబాద్‌లో సీనియర్ పురుషుల అంతర్ జిల్లా హాకీ టోర్నమెంటులో ప్రాతినిధ్యం వహించడానికి జిల్లా జట్టును ఆర్మూర్‌లో ఈనెల 14న ఉదయం 7గంటలకు ఎంపిక చేయనున్నామని జిల్లా హాకీ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్, రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాకీ ఇండియా ఐడీ నంబరు ఉన్నవారు మాత్రమే ఎంపికలకు అర్హులని పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా హాకీ సంఘం కోశాధికారి సురేందర్, సంయుక్త కార్యదర్శి మహమ్మద్ ఆరీఫ్, సభ్యుడు నాగేశ్‌కు రిపోర్టు చేయాలన్నారు.

దసరాకు జంబిగద్దె సిద్ధం

జక్రాన్‌పల్లి మండలం కొలిప్యాక్‌లో దసరా పర్వదినం కోసం జంబిగద్దెను సిద్ధం చేశారు. గ్రామంలోని ప్రధాన కూడలిలో ఇదివరకు పునాదుల వరకు నిర్మించిన చావిడి కట్టడాన్ని జంబిగద్దెగా మార్చారు. దీనికి వీడీసీ ఆధ్వర్యంలో రంగులు వేయడంతో వినియోగంలోకి రానుంది. దసరాకు గ్రామస్థులందరూ ఇక్కడికి వచ్చి పూజలు చేస్తారు.

– న్యూస్‌టుడే, జక్రాన్‌పల్లి













నిజామాబాద్
• నిజామాబాద్ అర్బన్ • నిజామాబాద్ రూరల్ • బోధన్ • బాన్సువాడ

రైతు సదస్సు విజయవంతం చేయండి

ఇందూర్ సిటీ, న్యూస్‌టుడే: వ్యవసాయ అనుబంధ రంగాలు, వాటి అభివృద్ధి అనే అంశంపై అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 18న ఎన్‌ఆర్ భవన్‌లో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరు భూమయ్య తెలిపారు. నగరంలోని ఎన్‌ఆర్ భవన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో వ్యసాయరంగం సంక్షోభంలో పడిందన్నారు. ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రన్న, కృష్ణగౌడ్, సాయిలు, చిన్నయ్య పాల్గొన్నారు.

బంజారాల దసరా ఉత్సవాలు

ఇందల్‌వాయి: ఇందల్‌వాయిలో బంజారా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం దసరా వేడుకలు నిర్వహించారు. జగదాంబ, సేవాలాల్ మహారాజ్‌కి పూజలు చేసి, భోగ్ బండార్ నిర్వహించారు. పూజచేసిన స్థలం వివాదంలో ఉన్నందునా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


భోగ్ బండార్ నిర్వహిస్తున్న బంజారాలు

ఈనాడు సినిమాలు

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏసియన్)
స్క్రీన్-1: విశ్వం 10.30, 4.25, 10.20(రాత్రి) దేవర పార్ట్-I 7.10
స్క్రీన్-2: మా నాన్న సూపర్ హీరో 10.30, 4.35 వెట్టయాన్ 1.30, 7.30
స్క్రీన్-3: వెట్టయాన్ 10.30, 4.20, 10.30 (రాత్రి) మా నాన్న సూపర్ హీరో 7.30
పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1: జిగ్ర 12.15 దేవర పార్ట్-I 3.35 మా నాన్న సూపర్ హీరో 7.10 మార్టిన్ 10.00(రాత్రి)
స్క్రీన్-2: విశ్వం 12.35, 3.50, 7.05, 10.20(రాత్రి)
స్క్రీన్-3: వెట్టయాన్ 1.50, 6.30, 10.00 (రాత్రి)మార్టిన్ 3.20
స్క్రీన్-4: మార్టిన్ 10.00 మా నాన్న సూపర్ హీరో 1.10 స్త్రై విద్యకా వో వాలా (హిందీ) 4.00, 10.40(రాత్రి) జిగ్ర 7.20
దేవి (ఎస్వీసీ) : మార్టిన్ 11.15, 2.15, 6.15, 9.15 (రాత్రి)
నటరాజ్(గీతా ఏసియన్): విశ్వం 11.00, 2.20, 6.00, 9.20(రాత్రి)
లలితామహల్(ఎస్వీసీ): దేవర పార్ట్-I 10.45, 2.15, 6.00, 9.30(రాత్రి)
విజయ్(ఎస్వీసీ): వెట్టయాన్ 11.00, 2.15, 6.00, 9.15(రాత్రి)
న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

చండీహోమాలు.. అభిషేకాలు


ఈస్ట్ బ్యాంక్‌లో పూలతో అమ్మవారి అలంకరణ
వర్నిలో..
దేవీరోడ్‌లో అమ్మవారి లడ్డూను రూ.55 వేలకు సొంతం చేసుకున్న అవన్‌కుమార్, గురువయ్యను అభినందిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
కోటగిరిలో..
బోధన్ గ్రామీణం : మినార్‌పల్లిలో..
న్యాల్కల్ రోడ్ లలితాదేవి ఆలయంలో..
ఎడపల్లిలో..
పేపరుమిల్లులో..
బోర్గాంలో..
బోధన్ అంబేడ్కర్ చౌరస్తాలో..
వినాయక్‌నగర్‌లో..
జక్రాన్‌పల్లి: చింతలూర్‌లో..
మోపాల్‌లో..
నవీపేట : దుర్గమ్మ ప్రతిమ ఊరేగింపు
కోటగల్లీ మార్కండేయ మందిరంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా
శక్కర్‌నగర్ రామాలయం వద్ద..
డిచ్‌పల్లి గ్రామీణం : ఘన్‌పూర్‌లో..
మోపాల్ : మంచిప్పలో..

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చింది. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా మహాచండీ హోమాలు, పంచామృతాభిషేకాలు, శ్రీచక్రార్చనలు, మంగళహారతులు సమర్పించారు. సామూహికంగా కుంకుమార్చనలు, లలితాసహస్ర నామ పారాయణాలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు.
– నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే:

మేమున్నాం.. మీకు తోడుగా..

94408 85670
80085 74007
98850 93048

సమస్య: నిజామాబాద్ నగరంలోని గాజుల్‌పేట ఖిల్లా రోడ్డులో కుక్కల సమస్య తీవ్రంగా ఉంది. పెద్దలే రోడ్లపైకి రావాలంటే జంకుతున్నారు. తగు చర్యలు తీసుకోగలరు **- రాజేందర్, స్థానికుడు**

సమాధానం: కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. **- నటరాజ్‌గౌడ్, నగర పాలక సంస్థ సిబ్బంది**

సమస్య: నగరంలోని శిర్డీసాయికృపానగర్ రోడ్ నం.2లో ఒక ప్రైవేటు పాఠశాల బస్సులను ఎప్పుడూ రోడ్డుపైనే కడగడంతో నీరు నిలిచి పాదచారులు నడవానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. **- రవి, స్థానికుడు**

పరిష్కారం: సదరు ప్రైవేటు పాఠశాల యాజమాన్యానికి రోడ్డుపై కడిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తాం. **- సునీల్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

సమస్య: నిజామాబాద్ నగరంలోని వినాయక్‌నగర్ నుంచి పులాంగ్ చౌరస్తా వరకు సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. రాకపోకల సమయంలో ఇబ్బందిగా ఉంది. తగు చర్యలు తీసుకోవాలి.
- సాయి, మాధవనగర్

పరిష్కారం: ఈ సమస్య కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. **- వాజీద్, ఏఈ, వినాయక్‌నగర్**

– న్యూస్‌టుడే, నిజామాబాద్ అర్బన్
నిజామాబాద్ నగరం

అందరికీ విజయం దక్కాలి : పాలనాధికారి

నిజామాబాద్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లా ప్రజలు విజయదశమిని సంతోషంగా నిర్వహించుకోవాలని పాలనాధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఈ మేరకు ఆయన ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. దుర్గామాత దీవెనలతో అందరికీ విజయాలు దక్కాలని ఆకాంక్షించారు.

దసరా శుభాకాంక్షలు : సీపీ

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని ప్రజలు సంతోషాలతో విజయదశమి పండగ నిర్వహించుకోవాలని నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ..

నిజామాబాద్ నగరం, న్యూస్‌టుడే: పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అర్బన్ ఎమ్మెల్యే..

దసరా పండగ సందర్భంగా నిజామబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని దేవీమాతను కోరుకుంటున్నానని చెప్పారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

నూతన పీఈటీలకు అభినందన

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: డీఎస్సీ నియామక పత్రాలు అందుకున్న నూతన పీఈటీలకు జిల్లా వ్యాయామ సంఘం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపామని సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. డీఈవో కార్యాలయంలో శుక్రవారం నూతన పీఈటీలు నవీన్, హరీశ్, కుమార్, రమేశ్, సుశ్మ, అన్వేష్, హైమద్‌పాషా, మహమ్మద్ అన్వర్‌లను కలిసి సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు రవీందర్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.


నూతన పీఈటీలో సంఘం ప్రతినిధులు

పెద్ద రాంమఠం భూముల పరిశీలన

నిజామాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: మోపాల్ మండలం కంజర, న్యాల్కల్‌రోడ్‌లోని పెద్దరాం మఠానికి చెందిన వ్యవసాయ భూములను శుక్రవారం దేవాదాయశాఖ సహాయ కమిషనర్ విజయరామారావు పరిశీలించారు. కౌలును నిర్ణయించిన మేరకు వెంటనే చెల్లించాలని కౌలుదారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం వర్నిరోడ్‌లో మఠానికి చెందిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్న వారి వివరాలను సర్వే నివేదిక ద్వారా తెలియజేయాలని సంబంధిత శాఖకు లేఖలు రాయాలని సిబ్బందికి సూచించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరు సమీపంలోని స్థలానికి కంచె ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఫిట్‌పర్సన్ వేణు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


కంజరలోని వ్యవసాయ భూములు పరిశీలిస్తున్న అధికారులు

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నుడా ఛైర్మన్‌గా కేశ వేణు నియామకం కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక కాంగ్రెస్ భవన్ ఎదుట పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ మహేష్ నేతృత్వంలో సంబురాలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కష్ట పడినవారికి గుర్తింపు లభించిందన్నారు. రామర్తి గోపి, సుభాష్, విక్కీ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ భవన్ ఎదుట నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

హైమాస్ట్ దీపాలు ప్రారంభం

ధర్పల్లి : ధర్పల్లిలో మూడు హైమాస్ట్ దీపాలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ప్రారంభించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, నాయకులు చెలిమెల నర్సయ్య, గంగారాజం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని వినతి

రెంజల్ : మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసి తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ ఆశ్రమానికి చెందిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీలు కోరారు. ఈ మేరకు శుక్రవారం కందకుర్తి మదర్సా ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై ఈ.సాయన్నకు వినతిపత్రం అందజేశారు.

గోడప్రతుల ఆవిష్కరణ

ఎడపల్లి : ఇప్టూ విలీన సభ విజయవంతం చేయాలని ఇప్టూ రాష్ట్ర కమిటీ నాయకుడు మల్లేష్ పిలుపునిచ్చారు. పోచారంలో శుక్రవారం విలీన సభ గోడప్రతులు ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో ఈ నెల 20న ఇప్టూను విలీనం చేయనున్నట్లు చెప్పారు. నాయకులు రవి, వైద్యనాథ్, భూమయ్య, లక్ష్మణ్, అమీర్, పోశెట్టి పాల్గొన్నారు.

ఉప విద్యాశాఖాధికారులను నియమించాలి

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఉప విద్యాశాఖాధికారులుగా తక్షణమే సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏసీ విజయభాస్కర్‌కి వినతిపత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలల్లో పర్యవేక్షణ బలోపేతం చేయాలని కోరారు.

టాస్క్‌ఫోర్సు ఏసీపీ బదిలీ

నిజామాబాద్ నేరవిభాగం : కమిషనరేట్ పరిధిలోని టాస్క్‌ఫోర్సు ఏసీపీ విష్ణుమూర్తిపై బదిలీ వేటు పడింది. దీనిపై శుక్రవారం సీపీ కల్మేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనను హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు. సీసీఎస్ ఏసీపీ నాగేంద్రచారికి టాస్క్‌ఫోర్సు విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు.

విద్యుత్తు శాఖ ఉద్యోగులు..

నిజామాబాద్ అర్బన్ : విద్యుత్తు శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా డీఈ నుంచి క్షేత్రస్థాయిలో పని చేసే జేఎల్‌ఎం వరకు మొత్తం సుమారు వందల సంఖ్యలో బదిలీలు జరిగాయి. ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ రవీందర్ బదిలీలకు సంబంధించిన జాబితాపై సంతకం చేయడంతో ఆ వివరాలను జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో అందుబాటులో ఉంచారు. ఈ నెల 15న బదిలీ అయిన చోట విధుల్లో చేరాలని ఆదేశాలు జారీ చేశారు.

విద్యార్థులకు అవగాహన

ఆర్మూర్ గ్రామీణం: కంటం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు, ఎన్నారైలు రవీందర్, మనోరమ ఆధ్వర్యంలో అంకాపూర్‌లో డిగ్రీ విద్యార్థులకు శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు.

6 నెలలు.. 80 చోరీలు


బోధన్ మండలం ఎరాజ్‌పల్లిలో ఇటీవల దుండగులు ధ్వంసం చేసిన నియంత్రిక

న్యూస్‌టుడే, బోధన్, నవీపేట

విద్యుత్తు నియంత్రికల ధ్వంసం ఆగడం లేదు. నియంత్రణకు రైతులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. నియంత్రికల నుంచి రాగి తీగలు, ఆయిల్ చోరీలు కొనసాగుతున్నాయి. బోధన్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆరు నెలల వ్యవధిలో 80 నియంత్రికలను దుండగుల ధ్వంసం చేయడం గమనార్హం. కీలక దశలో ఉన్న పంటను కంటికి రెప్పలా కాపాడుకునేందుకు రైతులు నిత్యం వరి పొలంలోనే కాలం గడుపుతున్నా.. పొలం వద్ద ఎవరూ లేని కొద్ది సమయాన్నే అదునుగా తీసుకుని దొంగలు తమ పని కానిచ్చేస్తున్నారు. నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో ఇప్పుడిప్పుడే వరి పొట్ట దశలో ఉంది. ఈ దశలో ఉన్న పొలానికి నీరు అందించడం అవసరం. ఒక్కరోజు నీటి సరఫరా నిలిచిపోతే నెలల తరబడి రైతు పడిన కష్టం ఆవిరవుతుంది. అందుకే చేనులో నిత్యం నీరుండేలా బోర్లు నడిపిస్తుంటారు. అదే సమయంలో నియంత్రికలను ధ్వంసం చేస్తుండటంతో వరి ధాన్యం ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. చోరీలతో విద్యుత్తుశాఖకు రూ. లక్షల్లో నష్టం వాటిల్లుతోంది. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' నవీపేట ఏఈ ప్రవీణ్‌కుమార్ వద్ద ప్రస్తావించగా.. చోరీలు అరికట్టేందుకు నియంత్రిక చుట్టూ నాలుగు వైపులా ఆంటీ తెఫ్ట్ నట్లు, బోల్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ఆగని రాగి తీగల అపహరణ

ఆరు నెలల్లో బోధన్ నియోజకవర్గంలోని మండలాల్లో నమోదైన కేసులు...

బోధన్	ఎడపల్లి	రెంజల్	నవీపేట	సాలూర
28	10	9	30	3

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిలిమ్స్ పోటీలకు ఆహ్వానం

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: శాంతిభద్రతలు, సమాజ రక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడి అమరులైన పోలీసుల జ్ఞాపకార్థం ఈ నెల 21 నిర్వహించే ఫాగ్ డే సందర్భంగా విద్యార్థులకు, ఔత్సాహికులకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహించనున్నామని నిజామాబాద్ పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ శింగెనవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభ చాటే అంశాలపై తీసిన మూడు ఫొటోలు (10*8), మూడు నిమిషాల నిడివి ఉండే షార్ట్‌ఫిలిమ్స్ తీసి పెన్‌డ్రైవ్‌లో వేసి 19న కమిషనరేట్‌లో ఎన్‌ఐబీ సీఐకి లేదా పోలీసు పీఆర్‌వోకు అందజేయాలని పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వాటిని రాష్ట్రస్థాయికి పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు చరవాణి నంబర్ 94400 01827లో సంప్రదించాలని సూచించారు.

చేపల వల చుట్టుకొని జాలరి మృతి

బోధన్ గ్రామీణం, న్యూస్‌టుడే : చేపలు పట్టేందుకు చెరువుకు వెళ్లి అదే వలలో చిక్కుకొని జాలరి మృతిచెందిన ఘటన బోధన్ మండలం అమ్దాపూర్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడ్డెయ్య (63) రెండు రోజుల కిందట బెల్లాల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చేపలు పడుతుండగా అదే వల కాళ్లకు చుట్టుకొని నీటిలో మునిగిపోయారు. తోటి జాలర్లు గాలించినా అతని ఆచూకీ లభించలేదు. శుక్రవారం అతని మృతదేహం చెరువులో గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గ్రామీణ ఎస్సై మశ్చేందర్‌రెడ్డి తెలిపారు.


ఒడ్డెయ్య

చికిత్స పొందుతూ..

నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే: జీజీహెచ్‌లో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాలుగో ఠాణా ఎస్‌హెచ్‌వో శ్రీకాంత్ తెలిపారు. నగరంలోని ఆర్యనగర్‌లో ఈనెల 9న గుర్తుతెలియని వ్యక్తి పడిపోయి ఉండటం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. వారు ఆయనను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే చరవాణి నంబర్లు 87126 9840, 87126 59836లో సమాచారం ఇవ్వాలని సూచించారు.



చోరీ కేసులో నిందితుడి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనం, చిత్రంలో నిందితుడు

నవీపేట, న్యూస్‌టుడే: నవీపేటలో వాహనాన్ని చోరీ చేసిన నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వినయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఈ ఏడాది ఆగస్టు 31న నవీపేటలో రోడ్డు పక్కన వ్యాన్‌ను నిలిపి ఓ వ్యాపారి జీవాలు కొనేందుకు అంగడిలోకి వెళ్లారు. తిరిగి వచ్చి చూడగా వాహనం కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మహారాష్ట్రలోని హింగోలి జిల్లా చించోడికి చెందిన తుకారం లక్ష్మణ్‌పవర్ వాహనాన్ని చోరీ చేసినట్లు సీసీ ఫుటేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో గుర్తించారు. ఈ మేరకు వ్యాను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. సదరు వ్యక్తిపై నాందేడ్ జిల్లాలో ట్రాక్టర్ దొంగతనం చేసిన కేసు ఉన్నట్లు ఆయన చెప్పారు. కేసును ఛేదించిన ఏఎస్సై గఫర్, కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, శ్రీనివాస్, వసంత్, రాజు, సాయినాథ్‌లను ఎస్సై అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

నిజామాబాద్ నేరవిభాగం : మాక్లూర్ ఠాణా పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. నందిపేట్‌కు చెందిన వసంత్, నవదీప్ భవనీమాత మాలధారణలో ఉన్నారు. వీరు వేర్వేరు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా.. దుర్గానగర్ వద్ద ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు నిజామాబాద్ నుంచి నందిపేట్ వెళ్తుండగా ప్రమాదం జరిగిందా.. లేదా ఇద్దరు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారా అనేది తేలాల్సి ఉంది.

దుమ్ముతో వాహనదారుల ఇక్కట్లు

రెంజల్ మండలం బోర్గాం రహదారిపై జాతీయ రహదారి గుత్తేదారు రాక్‌పౌడర్ వేయడంతో దుమ్ము లేచి సమీప జనావాసాల ప్రజలకు ఇబ్బందిగా మారింది. గుత్తేదారు తమ వాహనాల రాకపోకల సౌకర్యార్థం పౌడర్ వేసి రోలింగ్ చేయకపోవడంతో వచ్చి పోయే వాహనాలతో దుమ్ము లేచి నివాసాలపై పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇక్కడే రెండు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వేగ నిరోధకాలను సైతం తొలగించడంతో వాహనాల వేగానికి అడ్డూ.. అదుపు లేకుండా పోయింది. సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం కానుండగా వాహనాల వేగం కారణంగా చిన్నారులు ప్రమాదాల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దుమ్ము లేవకుండా రోడ్డుకు రోలింగ్ పనులు చేపట్టి వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, రెంజల్



ఆర్మూర్

● ఆర్మూర్ ● బాల్కొండ

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి శుక్రవారం ఆర్మూర్‌కు చెందిన ఈరవత్రి రాజశేఖర్‌ను పరామర్శించారు. ఇటీవల రాజశేఖర్ తండ్రి రాందాస్ అనారోగ్యంతో మరణించడంతో వెళ్లి కలిశారు. మాజీ ఎమ్మెల్యే వెంట భారాస ఆర్మూర్ నియోజకవర్గ బాధ్యుడు రాజేశ్వర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, నాయకులు పోల సుధాకర్, గంగాధర్ తదితరులు ఉన్నారు.


రాజశేఖర్‌తో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూర్ మండలం దేగాం ఆరోగ్యకేంద్రం పరిధిలోని గ్రామాల్లో డ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు జమున, రాజగంగు, ఆరోగ్య కార్యకర్తలు జమున, పద్మ, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

దుర్గమ్మను కొలిచి.. బతుకమ్మ ఆడి

ఆర్మూర్ డివిజన్‌వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా కొలువైన మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద మహిళలు బతుకమ్మలు ఆడారు. ఆర్మూర్ టీచర్స్ కాలనీలో జరిగిన వేడుకల్లో ఆర్మూర్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి పాల్గొన్నారు. మహర్నవమి సందర్భంగా లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో చండీహోమం నిర్వహించారు.

న్యూస్‌టుడే బృందం


బతుకమ్మతో యువతి


నెమలి బతుకమ్మతో జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి


ఆర్మూర్‌లో దాండియా ఆడుతున్న చిన్నారులు


కమ్మర్‌పల్లిలో లక్ష్మీగణపతి హోమం


ఉప్లూర్‌లో దుర్గాదేవికి కూరగాయలతో అలంకరణ


మామిడిపల్లిలో..


ఆర్మూర్‌లో..


లక్ష్మీనర్సింహస్వామి ఆలయ ఆవరణలో హోమంలో పాల్గొన్న భక్తులు


నిమిషాంభదేవికి పుస్తెలతాడు అందిస్తున్న నిర్మల్‌కు చెందిన శ్రీనివాస్, పద్మావతి


బాల్కొండలో పూజలందుకున్న దుర్గాదేవి


మెండోరాలో..

భూమి పూజ

భీమ్‌గల్, భీమ్‌గల్ గ్రామీణం: మండలంలోని మెండోర గ్రామ దుబ్బకాలనీలో బోరుబావి తవ్వకానికి ప్రాథమిక పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ మానస శుక్రవారం భూమిపూజ చేశారు. రమేష్, శేఖర్, రాజేశ్వర్ గౌడ్, నరేందర్, లింబాద్రి, రాజన్న, భూమన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నాడు వెలుగులీని.. నేడు బోసిపోయి

దసరా ఉత్సవాల సందర్భంగా ఆర్మూర్ బల్దియా ఆధ్వర్యంలో సుందరీకరణ పనులు చేపట్టిన ప్రాంతాల్లో విద్యుద్దీపాలతో అలంకరించేవారు. అంబేడ్కర్ చౌరస్తా కూడలిలో ఫౌంటెయిన్ దీపాల వెలుగుల్లో స్వీయచిత్రాల అడ్డాగా ఉండేది. ఫౌంటెయిన్ నిర్వహణను గాలికి వదిలివేయడంతో మరమ్మతులకు వచ్చింది. నిర్వహణలోకి తీసుకొచ్చేందుకు రూ.6.5 లక్షలు కేటాయించినా, పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని పుర కమిషనర్ రాజు పేర్కొన్నారు. దీంతో పురవాసులకు ఈ ఏడాది నిరాశే మిగిలింది. దసరా వేడుకలకు ఈ ప్రాంతం బోసిపోయింది.


గతంలో పండగలప్పుడు ఫౌంటెయిన్ వద్ద అలంకరణ


ప్రస్తుతం నీరు సైతం ఎత్తిపోయకుండా నిరుపయోగంగా మారిందిలా..

న్యూస్‌టుడే, ఆర్మూర్ పట్టణం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



ఏర్గట్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి విమర్శించడం మానుకోవాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. భారాస హయాంలో ఇచ్చిన వాటిలో ఎన్ని హామీలు అమలు చేశారన్నారు. అనంతరం డీఎస్సీలో ఉపాధ్యాయ కొలువులు సాధించిన వారితో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజారెడ్డి, రవి, మునీరొద్దీన్, రాజేశ్వర్, రమేశ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి చాటాలి

కమ్మర్‌పల్లి: ఆటల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తిని చాటాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, ఏఎస్సై నరేందర్ అన్నారు. కమ్మర్‌పల్లిలో ఈర్నాల అక్షయ్ స్మారకార్థం నిర్వహించిన బాల్కొండ నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ ముగింపు వేడుకలకు శుక్రవారం వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. విజేతగా నిలిచిన కమ్మర్‌పల్లి జట్టుకు రూ.20 వేల నగదుతోపాటు ట్రోఫీ, రన్నరప్ తిమ్మాపూర్ జట్టుకు రూ.10 వేల నగదు, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో ఈర్నాల గంగాధర్, సీఐ మోహన్, పాలెపు రాజేశ్వర్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న కేఎంసీ ఛైర్మన్ నర్సయ్య, ఏఎస్సై నరేందర్

విద్యార్థులకు అవగాహన సదస్సు

ఆర్మూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: కంటం ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఎన్నారైలు రవీందర్, మనోరమ ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో డిగ్రీ విద్యార్థులకు శుక్రవారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు భవిష్యత్తు ప్రణాళికలపై దిశానిర్దేశం, వ్యక్తిగత అభివృద్ధి అంశాలపై వివరించారు. పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో రవీందర్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన విద్యార్థులతో నిర్వాహకులు

ఆర్థికసాయం

భీమ్‌గల్: భీమ్‌గల్ పట్టణానికి చెందిన చింతలూరి ఇస్తారమ్మ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి ఇచ్చిన రూ.5 వేలను జిల్లా కార్యదర్శి కుంట రమేష్ అందజేశారు. నాయకులు అనంతరావు, నర్సయ్య, లక్ష్మణ్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయాలు


నిజామాబాద్ నేరవిభాగం, న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన ఘటన మాక్లూర్ ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నందిపేట్‌కు చెందిన వసంత్, నవదీప్ వేర్వేరు ద్విచక్రవాహనాలపై వెళ్తుండగా.. దుర్గానగర్ వద్ద ప్రమాదం జరిగింది. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో క్షతగాత్రులను జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు నిజామాబాద్ నుంచి నందిపేట్ వెళ్తుండగా ప్రమాదం జరిగిందా.. లేదా ఇద్దరు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నారా అని తేలాల్సి ఉంది.

జూదరుల పట్టివేత

బాల్కొండ: కిసాన్‌నగర్ శివారులో జూదస్థావరంపై శుక్రవారం దాడి చేసి ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్సై బి.నరేష్ తెలిపారు. వారి నుంచి రూ.3560 నగదు జప్తు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఈనాడు సినిమా

విశ్వంభర రాకతో


చిరంజీవి

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. త్రిష నాయికగా నటిస్తోన్న ఈ సినిమాని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విడుదల తేదీపై నేడు చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి.

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం


వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్'గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!


శ్రుతి హాసన్


నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నటి శ్రుతిహాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్ హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు.


బాలకృష్ణ


ప్రభాస్


అల్లు అర్జున్


ఎన్టీఆర్


నాని

అంచనాలు పెంచుతున్న విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలంటే నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. ఇప్పుడిలా వరస విజయాలతో దూసుకుపోతూ తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

కథానాయకులు వరుస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరుస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకె 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజాసాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌తో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

జైత్ర యాత్ర సాగనీ..

చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో జోరుగా సాగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయికి చేరువైంది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువ హీరోలు అడివి శేష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.


ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు


వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "ఈ చిత్ర కథను.. అందులోని వినోదాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. సినిమా ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.

విజయీభవ

నేడు విజయ దశమి



న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్

దసరా.. పది తలల రావణుడి సంహారం. విజయదశమి.. చెడుపై మంచి సాధించిన విజయం. పేర్లు వేరైనా పండగ అర్థం ఒకటే. మంచికి లభించిన విజయం. సమాజాన్ని వణికిస్తున్న రావణుడు, మహిషాసురుడు.. అనే రాక్షసులను శ్రీరాముడు, దేవీ మాత సంహరించి విముక్తి ప్రసాదించారు. వారి రాక్షస స్వభావమే వారి పతనానికి కారణమైంది. వర్తమానంలోనూ మనిషి చర్యలు దారి తప్పుతున్నాయనే వాదన ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని గుణాలను దూరం చేసుకోవాల్సిన అవసరముంది. ముఖ్యంగా వ్యక్తిగత, సామాజిక జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలు సరిచూసుకుని.. లోపాలుంటే సవరించుకోవడం, సరిగా ఉంటే మరింత మెరుగ్గా జీవించడానికి ప్రయత్నించడం అవసరం. ఆ అంశాలు ఏంటో సమీక్షించుకుని విజయదశమి స్ఫూర్తితో విజయం వైపు సాగుదాం.

వ్యక్తిగత జీవితం..

ఆర్థికం



సమాజంలో జరిగే నేరాల్లో ఆర్థికపరమైన నేపథ్యం ఉన్నవే ఎక్కువ. అందుకు అత్యాశ, దుబారా వంటివి కారణమవుతున్నాయి. డబ్బు కోసం ఆరాటపడే క్రమంలో ఆత్మహత్యలు, హత్యలకు పాల్పడి వ్యక్తిగత జీవితాన్ని దుర్భరం చేసుకుంటున్నారు. ఆది నుంచి న్యాయబద్ధంగా వచ్చే ఆదాయాన్ని సమర్థంగా వినియోగించుకునే ప్రణాళికలు రూపొందించుకుంటే జీవితానికి ఆర్థిక భరోసా లభిస్తుంది.

2023 ఏడాదిలో..
- ★ ఆత్మహత్యలు : 345
- ★ ఆస్తి సంబంధిత తగాదాలు : 1212

ఆరోగ్యం




ప్రస్తుతం ఎక్కువ కుటుంబాల్లో ఎవరో ఒకరు ఏదో ఒక అనారోగ్య సమస్య ఎదుర్కొంటున్నారనే వాదన ఉంది. ఈ సమస్యకు కారణం ఏదైనా... మన జీవన విధానమే ప్రధానమని నిపుణుల అభిప్రాయం. శారీరక శ్రమ లేకపోవడం, ఆహారపు అలవాట్లు వ్యాధులబారిన పడటానికి కారణమవుతున్నాయని చెబుతున్నారు. సమతుల ఆహారం, సరిపడా నిద్ర, శారీరక శ్రమతో ఆరోగ్యకర జీవితం సాగించాలి.

జీవనశైలి వ్యాధులు..

వ్యాధి	నిజామాబాద్	కామారెడ్డి
రక్తపోటు	75,068	68,752
మధుమేహం	34,476	44,654

నిర్లక్ష్యం




వ్యక్తిగత, కుటుంబం, సమాజంపై నిర్లక్ష్య ధోరణి చిక్కులకు కారణమవుతుంది. కుటుంబ బాధ్యతల నిర్వహణతో పాటు సమాజంలో విలువలతో కూడిన వ్యక్తిగా జీవిస్తే ఉత్తమం. లేదంటే సమాజంలో వ్యక్తిగతంగా నిర్లక్ష్యానికి గురై ఒంటరిగా మారుతారు.

వ్యసనం


మద్యం, పాన్‌మసాలా, డ్రగ్స్, కల్తీ కల్లు, గంజాయి, అశ్లీల చిత్రాల వీక్షణ. ఇదీ ఇప్పుడు సమాజంలో వినిపించే వ్యసనాల జాబితా. వీటికి బానిసకావడంతో మనిషి తన సహజ ప్రవర్తన మర్చిపోయి భిన్నంగా వ్యవహరిస్తున్నాడు. వీటికి బానిసలైన వారు తదుపరి నేరస్థులుగా మారుతున్నారు. చోరీలు, అత్యాచారం, హత్య వంటి నేరాలకు వ్యసనాలు కారణమవుతున్నాయి. ఈ వ్యసనాలకు దూరంగా ఉండటం మేలు.

★ మహిళలపై అఘాయిత్యాలు : 388



★ నిజామాబాద్ జిల్లా వివరాలు

ఆవేశం



కోపాన్ని ప్రదర్శించే క్రమంలో కొందరు నేరాలకు పాల్పడుతున్నారు. చివరకు రక్తసంబంధీకులను కూడా లెక్కచేయకుండా ప్రాణం తీసే వరకు వెళ్తున్నారు. ఆవేశం, కోపం, అహం వంటివి వీడి ఎలాంటి సమస్యనైనా సామరస్యంగా పరిష్కరించుకోవాలి. 'తన కోపమే తన శత్రువు' అనే మాట మరువరాదు.

★ ఘోరమైన నేరాలు : 1070

సామాజిక అంశాలు..



ఆరేళ్ల పైబడిన జనాభాలో లింగ నిష్పత్తి (1000 మంది పురుషులకు)
- నిజామాబాద్ : 1044
- కామారెడ్డి : 1033

ఆరేళ్లలోపు పిల్లల్లో
- నిజామాబాద్ 953
- కామారెడ్డి 941

లింగ వివక్ష

నవరాత్రులు అమ్మవారిని నిష్ఠతో పూజించిన సమాజం మనది. కానీ వ్యక్తిగత విషయానికి వస్తే అమ్మవారి స్వరూపంగా భావించే ఆడబిడ్డలపై వివక్ష కొనసాగుతోంది. అందుకు నిదర్శనమే జిల్లాలో ఇటీవల పెరుగుతున్న లింగ నిర్ధారణ కేసులు. కామారెడ్డి జిల్లాలో రెండు ఘటనలు పరిస్థితి తీవ్రతను చాటాయి. అమ్మవారి స్వరూపమైన ఆడబిడ్డల విషయంలో వివక్షను పారదోలాల్సిన అవసరముంది.

ధరాఘాతం



పండగ పూట కూరగాయల ధరలు సామాన్యుడికి ఇబ్బందిగా మారాయి. కూరగాయలు సహా నూనెగింజలు వంటివి సాగు చేసుకునే సామర్థ్యం పల్లె ప్రజలకు ఉంది. పట్టణాల్లోనూ మిద్దెసాగుతో కుటుంబ అవసరాలు తీర్చుకోవచ్చు. కానీ ఆ కోణంలో ఆలోచించకపోవడంతో అందరూ మార్కెట్‌పై ఆధారపడే సరికి ధరలు పెరుగుతున్నాయన్న వాదన ఉంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటికి సరిపడా ఉత్పత్తి చేస్తే మేలు.

నిజామాబాద్ : 25,556
కామారెడ్డి : 28,301

2022లో రెండు జిల్లాల్లో ఉత్పత్తి అయిన కూరగాయలు (మె.ట.)

పర్యావరణం



అడవుల నరికివేత, ప్లాస్టిక్ వినియోగం, ఇసుక తోడేయడం, నదుల సహజత్వాన్ని దెబ్బతీయడం వంటి చర్యలతో పర్యావరణ సమతుల్యం దెబ్బతింటోంది. ఫలితంగా అతి వర్షాలు, వర్షాభావం, తీవ్ర ఎండలు వంటి అసహజ వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయి.

★ ఇసుక చౌర్యం కేసులు : 3

వనరుల సంరక్షణ



మన పరిధిలో మనమే జల, సహజ వనరుల సంరక్షణకు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో వ్యవహరించాలి.

ఉమ్మడి జిల్లాలో చెరువులు : 3400

ట్రాఫిక్ నియమాలు



ట్రాఫిక్ నిబంధనలు పాటించండి అంటూ అధికారులు నిత్యం సూచిస్తుంటారు. అయినా మార్పు రావడం లేదు. ఈ దసరా నుంచి అయినా ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేద్దాం.

★ రోడ్డు ప్రమాదాలు : 287
★ ఈ-చలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు : 3,31,588

అక్రమాలు ఆపేదెవరు..?

- బల్దియాల్లో పట్టణ ప్రణాళిక విభాగం నిర్వీర్యం
- అరకొర సిబ్బందితో పర్యవేక్షణ గాలికి

ఈనాడు, నిజామాబాద్

మున్సిపాలిటీల పరిధిలో పార్కు స్థలాలు.. కాలనీల్లో రోడ్ల ఆక్రమణలు నిలువరించాలి. అనుమతి తీసుకొని చేపట్టే నిర్మాణాల్లోనూ అతిక్రమణలు లేకుండా చూడాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు వేయాలి. పురపాలికల్లో ఇంతటి కీలక విధులు కలిగిన పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది కొరతతో నిర్వీర్యంగా మారిందనే విమర్శ ఎదుర్కొంటోంది. పైగా అరకొర ఉద్యోగులు రెండు, మూడుచోట్ల డిప్యుటేషన్లపై కొనసాగుతుండటంతో ఎక్కడా న్యాయం చేయడం లేదు. ఉమ్మడి జిల్లాలో నగర పాలక సంస్థతో పాటు బల్దియాల్లో అధ్వాన పరిస్థితి నెలకొంది.

నిజామాబాద్‌లో 19కి నలుగురే..

నిజామాబాద్ నగరపాలకలో పునర్విభజనకు ముందు 50 డివిజన్లకు కేటాయించిన క్యాడర్ స్ట్రెంత్ 19. కానీ, కేవలం నలుగురే ఉద్యోగులున్నారు. తొమ్మిది గ్రామాల విలీనం తర్వాత 60 డివిజన్లయ్యాయి. పరిధి విస్తరించిన క్రమంలో నిర్మాణాలు, ఆక్రమణల గుర్తింపునకు పట్టణ ప్రణాళిక విభాగంలో పోస్టులు పెంచాలి. కానీ, పాత క్యాడర్ స్ట్రెంత్ మేరకైనా భర్తీ లేకపోవడంతో 80 వేలకు పైగా గృహాలున్న నగరంలో పర్యవేక్షణ ఎలా సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసేందుకు టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్‌సియర్స్ (టీపీబీవోలు) ఏడు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు ఆరుగురికి ఇద్దరే ఉన్నారు. నుడా చీఫ్ ప్లానింగ్ అధికారి శ్యాం కార్పొరేషన్ ఇన్‌ఛార్జి డీసీపీగా కొనసాగుతున్నారు.

మిగతా చోట్లా అదే పరిస్థితి

జిల్లా కేంద్రమైన కామారెడ్డిలో ఆరుగురు ఉద్యోగులకు ఇద్దరే ఉన్నారు. ఏడు గ్రామాలు విలీనమై 49 వార్డులు అయ్యాయి. పరిధి పెరిగినా సిబ్బంది లేక పర్యవేక్షణ కొరవడింది. బోధన్‌లోనూ 8 పోస్టులకు ఇద్దరే ఉన్నారు. ఇక్కడి టీపీఎస్ ఆర్మూర్, భీమ్‌గల్‌లో రెండేసి రోజులు, బాన్సువాడలో ఒకరోజు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. మెదక్ మున్సిపాలిటీ టీపీఎస్ ఎల్లారెడ్డిలో వారంలో ఒకరోజు ఉంటారు.

ఇతర పనులకు కేటాయింపు

ప్రతి బల్దియాలో నెలలో 30 నుంచి 50 భవన నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు వస్తుంటాయి. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సింది పట్టణ ప్రణాళిక విభాగమే. ప్రభుత్వ జాగాల్లో అక్రమ నిర్మాణాలు, నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులు విచారించాల్సి ఉంటుంది. ప్రస్తుతం వేలాదిగా వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో లక్ష్యం నిర్దేశించారు. డిజిటల్ సర్వే, నాలాలు, చెరువుల ఆక్రమణల గుర్తింపు విధులనూ కేటాయించారు. ఉన్న కొద్దిమంది రోజు చేయాల్సిన పనులకు భిన్నంగా ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో తీరిక లేకుండా ఉంటున్నారు.

ఇదేబాటలో ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు

టీఎస్‌బీపాస్ అమల్లోకి వచ్చాక 2021 నుంచి నిర్మాణాల్లో నిబంధనల ఉల్లంఘనలు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలకు ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక తహసీల్దార్ నేతృత్వంలో టీపీవో, ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖల సహాయ ఇంజినీర్లు, అగ్నిమాపకశాఖ అధికారి సభ్యులుగా ఉంటారు. ఈ బృందం వచ్చిన ఫిర్యాదులతో పాటు పట్టణ ప్రణాళిక విభాగం ఫిర్యాదులను సైతం క్షేత్రస్థాయిలో విచారించి అక్రమాలు ఆపాలి. వివిధ శాఖల భాగస్వామ్యంతో ఏర్పాటైన ఈ బృందం సమన్వయంతో పనిచేయాలి. కానీ, ఆయా శాఖల విధుల్లో తీరికలేకుండా ఉండే అధికారులు.. అసలు ఎన్‌ఫోర్స్‌మెంటు విధుల ఊసెత్తడం లేదు. శాసనసభ ఎన్నికల తర్వాత సమావేశమై సమీక్షించిన దాఖలాలు లేవు.



పురపాలిక	రికార్డుల్లో ఇళ్లు	వార్డులు	పట్టణ ప్రణాళిక విభాగం పోస్టులు	ఖాళీలు
ని.నగరం	80,000	60	19	15
బోధన్	18,000	38	6	2
ఆర్మూర్	22,188	36	4	2
భీమ్‌గల్	5,760	12	పోస్టు లేదు	–
కామారెడ్డి	26,556	49	6	4
బాన్సువాడ	10,000	19	పోస్టు లేదు	–
ఎల్లారెడ్డి	5400	12	పోస్టు లేదు	–